క్లుప్తంగా

నృసింహ స్వామి జయంతి వేడుకలు



అచ్యుతాపురం శ్రీకృష్ణ మందిరంలో లక్ష్మీనరసింహస్వామి

కొయ్యలగూడెం: నరసింహ స్వామి జయంతిని పురస్కరించుకొని అచ్యుతాపురంలోని కృష్ణ చైతన్యాశ్రమ మందిరంలో వేడుక నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు చరణ్‌దాస్ ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహస్వామి చిత్రపటానికి విశేష పూజలు చేశారు. భక్తులు నాలుగు గంటల పాటు నిర్విరామంగా భక్తి రంజని కార్యక్రమం, పారాయణ కార్యక్రమాలు నిర్వహించారు. ఒడిశా సంప్రదాయ రీతిలో వైష్ణవగమన సంప్రదాయం ప్రకారం ప్రత్యేక సేవలు చేయగా, చైతన్య ప్రభు, రాధాకృష్ణ విగ్రహాలను అలంకరించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమంలో అచ్యుతాపురం, జగన్నాథపురం గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

నూకాలమ్మకు పూజలు



నూకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి నిత్యకైంకర్యాలతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు), రామలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు మనోజ్ శర్మ పూజలు నిర్వహించారు. అమ్మ వారి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ప్రసాదవితరణకు కాకొల్లు ద్వారకా నాగవెంకట మణికంఠ, దుర్గాస్నేహిత దాంపతులు రూ.5,116 విరాళంగా అందజేశారని చైర్మన్ పండు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలి



ఎమ్మెల్యే ఎలీజాను సత్కరించిన నాయకులు

జంగారెడ్డిగూడెం: నిర్దేశించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించి నాయీ బ్రాహ్మణ సేవా సంఘానికి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. చింతలపూడి నియోజకవర్గ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన చిప్పాడ నరసింహారావు (వెంకన్న) శుక్రవారం ఎమ్మెల్యే ఎలీజాను మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘ నాయకులతో కలిసి ఎమ్మెల్యేను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదవులను సమర్ధవంతంగా నిర్వహించి, వ్యక్తిగతంగా, సంఘపరంగా ఉన్నత స్థాయిని చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం జంగారెడ్డిగూడెం అధ్యక్షుడు మల్లవరపు నాగపోసు, కామవరపుకోట అధ్యక్షులు చేడే నాగరాజు, సెక్రటరీ కొప్పుల దుర్గాప్రసాద్, ఉప్పలపు నాగేశ్వరరావు, అన్నవరపు సుబ్రహ్మణ్యం, రాయవరపు సత్యంబాబు, శిలరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రంగాపురం సత్యదేవుని కల్యాణోత్సవం



రంగాపురంలో సత్యదేవుని తిరు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

లింగపాలెం: రాష్ట్రంలోనే రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన లింగపాలెం మండలం రంగాపురం సత్యదేవుడు, భూదేవీ, నీళాదేవీల పరిణయం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, బాణసంచా వెలుగుల మధ్య విద్యుత్ దీపాలతో అలంకరించిన స్వామివారి సన్నిధిలో స్వామి కల్యాణం పాంచరాత్ర ఆగమ పండితులు గోవర్ధన గోపాలాచార్యులు, ఆలయ అర్చకులు తిరుమల కాండూరి శేషాచార్యులు నిర్వహించారు. కార్యక్రమంలో విశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామిదేవస్థానం అధికారుల పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కల్యాణోత్సవానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు విచ్చేశారు. వరికి గ్రామస్తులు, దాతల సహకారంతో ప్రసాదాలు తయారు చేసి అందజేశారు. భక్తులకు స్వామి వారి తలంబ్రాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. క్యాక్రమంలో ఆలయ ఉద్యోగులు రాధిక, గోపి, తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో అన్నివర్గాల ప్రజలకూ మేలు

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



దర్భగూడెంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



తాడిచర్లలో పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలకు అంతులేని విశ్వాసం, నమ్మకం ఉన్నాయని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. జీలుగుమిల్లి మండలం దర్భగూడెం సచివాలయం పరిధిలో శుక్రవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లల్లో ప్రభుత్వం అమలుచేసిన పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేదలకు మేలు చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. నవరత్నాల పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. ప్రజలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌ల ద్వారా అర్హులందరికీ పథకాలను మంజూరు చేయాలన్నారు. ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పాలనను ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని తెలిపారు. చంద్రబాబుకి ఎన్నికల సమయంలోనే ప్రజలు గుర్తుకు వస్తారని విమర్శించారు. గతంలో చంద్రబాబు పాదయాత్ర చేసి ప్రజలకు చేసిన వాగ్దానాలు నెరవేర్చక పోవడంతో ముఖం చెల్లక తన కొడుకు లోకేష్‌ను పాదయాత్ర పేరుతో ప్రజల ముందుకు పంపుతున్నాడని తెలిపారు. కొడుకు లోకేష్ కూడా తండ్రికి మించిన తనయుడే అన్నారు. తండ్రీకొడుకుల స్వార్థ రాజకీయం తప్ప ప్రజలపై ప్రేమ లేదని బాలరాజు విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లం వసంతరావు, సొసైటీ అధ్యక్షుడు కొల్లూరు రాంబాబు, బోదా శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ సున్నం ఉషారాణి, ఎంపీటీసీ కంచర్ల సుధారాణి, ఉప సర్పంచ్ కేతిరెడ్డి రాఘవరెడ్డి, సచివాలయ కన్వీనర్ పైడిమర్ల జగన్ మోహన్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ వనమా రామకృష్ణ, నాయకులు దాసరి వేణు, చక్రవర్తి, చందా ప్రసాద్, కె.చక్రవర్తి, బి.ప్రేమ్‌కుమార్, చిట్టిబొమ్మ శ్రీను, ఎంపీడీఓ మంగతయారు, తహసీల్దార్ ఎలీషా, వెలుగు ఏపీఎం రామారావు, సీఐ బి.వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పథకాలతో ప్రతి ఇంటా సంతోషం

కామవరపుకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తోన్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం వ్యక్తమవుతోందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. 130వ రోజు శుక్రవారం కామవరపుకోట మండలం తాడిచర్ల గ్రామ పంచాయతీలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ఆయన గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ పేరుతో అర్హులు పథకాలు అందక, రాష్ట్రం అభివృద్ధికి నోచుకోక ప్రజలు అల్లాడిపోయారని గుర్తుచేశారు. 40 ఏళ్ల చంద్రబాబు రాజకీయ జీవితంలో రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని, మాయ మాటలతో ప్రజలను మోసం చేశారని వివరించారు. నాలుగేళ్లలో ముఖ్యమంత్రి జగన్ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి వలంటరీల ద్వారా ప్రతి గడపగడపకూ పథకాలు అందజేస్తున్నారని, సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రం సుభిక్షంగా ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజలు జగన్ వైపే చూస్తున్నారని, టీడీపీ నాయకుల మోసపూరిత మాటలు నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ప్రతిపక్ష హోదాకు కూడా నోచుకోదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి మరల జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవుతారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు మిడత రమేష్‌బాబు, నానాది సాగర్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్ సెల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రామకృష్ణ, ఎంపీటీసీ పోలిమెట్ల ప్రశాంత్, బొట్ల లక్ష్మణ్, వైఎస్సార్‌సీపీ తాడిచర్ల కార్యకర్తలు ఇమ్మడి రాంబాబు, కె.పండు, మిడత మారయ్య, గుడెల్లి జోజి, మంగరాజు, యేసు, నాగరాజు, శ్రీను, వంశీ, సతీష్, రాంబాబు, వల్లి, రామకృష్ణ, బూరియ, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఉచిత ఫిజికల్ ఫిట్‌నెస్ క్యాంప్ ప్రారంభం



ఇండోర్ రోయింగ్ మెషీన్‌లను ప్రారంభిస్తున్న ఎస్సై, సర్పంచ్ తదితరులు

ద్వారకాతిరుమల: యువతకు ఉపయోగపడేలా వేసవి సెలవుల్లో ఉచిత ఫిజికల్ ఫిట్‌నెస్ (ఇండోర్ రోయింగ్) కోచింగ్ క్యాంప్ ఏర్పాటు చేయడం శుభపరిణామమని ఎస్సై టి.సుధీర్ అన్నారు. ద్వారకాతిరుమల వసంత్‌నగర్ కాలనీలో ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ, ఏలూరు జిల్లా స్పోర్ట్స్ అథారిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను ఎస్సై శుక్రవారం ప్రారంభించారు. క్యాంప్ ఏర్పాటుకు కృషి చేసిన కోచ్ ఊదర్ల విజయ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను యువత సద్వినియోగం చేసుకుని ఫిట్‌నెస్‌ను పెంచుకోవాలని సూచించారు. కోచ్ విజయ్ మాట్లాడుతూ మండలంలోనే తొలిసారిగా ఈ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏలూరు (చీఫ్ కోచ్) శ్రీనివాస్ పర్యవేక్షణలో ఈ క్యాంపును నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇందులో 8 ఏళ్ల బాలల నుంచి ఆపై వయస్సుగల వారు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్ 7569870027లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంటం స్వర్ణలత, ఎంపీటీసీ పెద్దిరెడ్డి రమ్య కుసుమ, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, రుద్ర శివాజీ, అచ్యుత ఏసుబాబు, జగన్మోహిని, చిలుకూరి నాగసుబ్రహ్మణ్యం, ఊదర్ల జోషి తదితరులున్నారు.

7న అంకమ్మతల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ



కొణిజర్లలోని అంకమ్మతల్లి ఆలయం



ఆలయం వద్ద కలశ పూజ చేస్తున్న భక్తులు

లింగపాలెం: కొణిజర్లలో పాత అంకమ్మ తల్లి ఆలయం వద్ద దాతల సహకారంతో నిర్మించిన ఆలయ, విగ్రహ, ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం వద్ద శుక్రవారం ఆగమ పురోహితులు రామడుగు వాసు శర్మ, జ్యోతిర్వాస్తు ఆగమ బ్రహ్మశ్రీ లింగోజి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఉదయం 6.57 నిమషాలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందన్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటుచేశామని, దాతలు, గ్రామస్తుల సహకారం సుమారు రూ.60 లక్షలతో ఆలయాన్ని నిర్మించినట్టు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

అభివృద్ధికి కృషి చేయాలని వినతి



ఎమ్మెల్యే బాలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతంలోని ముంజులూరు, పులిరామన్నగూడెం, గడ్డపల్లి, అలివేరు, కోర్సవారిగూడెం గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) ప్రజా ప్రతినిధులు, ఆ సంఘ నాయకులు బృందం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని దుద్దుకూరులో ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు వినతి పత్రం అందజేశారు. ఎంపీపీ కారం శాంతికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ మారుమూల గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో వీధిలైట్లు, డ్రెయినేజీలు, పంచాయతీరాజ్ రోడ్లు, ఆర్‌అండ్‌బీ రోడ్లు పనులు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంత అభివృద్ధికి కృషి చేసేందుకు కట్టుబడి ఉన్నారని తెలిపారు. తప్పనిసరిగా ఆయా పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ధర్ముల సురేష్, పోరంట్ల శ్రీనివాస్, కారం రాఘవ, సర్పంచ్‌లు మడి శ్రీరాములు, కొర్సా గంగరాజు, కారం లక్ష్మి, ఎంపీటీసీలు గోవింద రాజులు, మడకం వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి వాటర్ ట్యాంకర్ అందజేత



వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న గారపాటి చౌదరి, చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: ప్రజలకు ఉపయోగపడే ప్రతి కార్యక్రమానికి తపన ఫౌండేషన్ సహకారం అందిస్తుందని తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. జంగారెడ్డిగూడెం ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు తపన ఫౌండేషన్ ద్వారా జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీకి కొత్త వాటర్ ట్యాంకర్‌ను ఆయన శుక్రవారం అందజేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద వాటర్ ట్యాంకర్‌ను చౌదరితో కలిసి జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్మన్ బత్తిన లక్ష్మి ప్రారంభించారు. చౌదరి మాట్లాడుతూ కొద్ది నెలల క్రితం జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీకి మూడు చెత్త సేకరిక్షాలను అందించామని, మున్సిపల్ కమిషనర్ విజ్ఞప్తి మేరకు వాటర్ ట్యాంకర్ అందించామని తెలిపారు. తపన చౌదరికి బత్తిన లక్ష్మి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మున్సిపాల్ కమిషనర్ భవాని, కౌన్సిలర్ నంబూరి రామచంద్ర రాజు, బీజేపీ నాయకులు చౌటుపల్లి విక్రమ్ కిషోర్, అర్జుల మురళి, తాణింకి శివ గణేష్, మక్కిన శ్యాంసుందర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌతమ బుద్ధుడి జయంతి



జంగారెడ్డిగూడెంలో నిర్వహిస్తున్న బుద్ధుడి జయంతి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో గౌతమ బుద్ధుడు 2567 జయంతి ఘనంగా నిర్వహించారు. భరోసా స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో రాజీవ్ నగర్‌లో ఉన్న గౌతమ బుద్ధుడి విగ్రహానికి పూలమాల వేసి బుద్ధ వందనం చేశారు. సంస్థ అధ్యక్షుడు ఆర్‌వీవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడారు. బుద్ధుడు ఆలోచనా విధానం నేటి సమాజానికి అవసరం అన్నారు. బుద్ధ విగ్రహ నిర్మాణానికి సహకరించిన పి.శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కోట సుబ్బారావు, కె.రాజ్‌కుమార్, ఈర్ని సూరిబాబు, యడ్లపల్లి ఏడుకొండలు, ఎల్ఆర్ కృష్ణబాబు, అంజనా పూలే, ఇన్వర్టర్ నాగు, జేవీడీ ఆనంద్, మందపల్లి అయ్యన్న, కె.నాగేశ్వరరావు, దాసరి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కొయ్యగూడెంలో..

కొయ్యలగూడెం: బుద్ధ భగవానుని 2,567 జయంతి సందర్భంగా స్థానిక శ్రీరుక్మిణి సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో దశావతార మూర్తులలో ఒకటైన విగ్రహానికి అర్చకులు గుడిపూడి శేషాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అహింసా మార్గాన్ని ప్రపంచానికి మొట్టమొదటిసారిగా చూపించిన మార్గదర్శి తథాగతుడు అని వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ముద్దు గోపి, సర్పంచ్ పసుపులేటి రాంబాబు, శ్రీరంగం కాశీ విశ్వనాథం బూసి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న మన్నవ కృష్ణచైతన్య

చింతలపూడి: కౌలు రైతులకు రైతు అంగీకారంతో సంబంధం లేకుండా వ్యవసాయ శాఖ, రెవెన్యూ ఉమ్మడిగా గ్రామాల్లో సర్వే చేసి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని కోరారు. కౌలు రైతు సంఘం సమావేశం సీపీఐ కార్యాలయంలో ఎస్‌కే కాలేషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ గ్రామాల్లో కౌలు చేస్తున్న రైతులకు రైతు అంగీకార పత్రం తీసుకురావాలనే నిబంధన పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. సేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవ్వాలని, రైతులకు ఇచ్చే అన్ని పథకాలు కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలని కోరారు. జూన్ 3న చింతలపూడి మండలం మల్లాయగూడెంలో కౌలు రైతుల జిల్లా మహాసభ నిర్వహించాలని తీర్మానించారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి దొంత కష్ట, రైతు సంఘం నాయకులు తాడిగడప మాణిక్యాలరావు, తక్కెళ్లపాడు ప్రసాద్, ఎస్‌కే జానీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



సీతంపేటలో వ్యవసాయ కార్మికుల ఉద్దేశించి మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు

కొయ్యలగూడెం: ఉపాధి హామీ పనిలో నేషనల్ మొబైల్ మోనిటరింగ్ ఫొటో రద్దు చేయాలని రెండు పూటల పని తీసేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు సమస్యలపై నిర్వహిస్తున్న ప్రచార యాత్ర కొయ్యలగూడెం చేరుకుంది. నరసన్నపాలెం, సీతంపేట, బయ్యనగూడెం, కొయ్యలగూడెం, గవరవరం, చొప్పరామన్నగూడెం గ్రామాలలో యాత్ర నిర్వహించారు. బృందంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం మాట్లాడుతూ కేంద్రం మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసివేయాలని కుట్ర పన్నుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం బడ్జెట్ కేటాయింపులో మోదీ ప్రభుత్వం రూ.30 వేల కోట్లు తగ్గించిందని ఆరోపించారు. 200 రోజులు పని దినాలు, రూ.600 రోజు వేతనం, ప్లే స్లిప్పులు, గతంలో ఇచ్చిన పనిముట్లు, మజ్జిగ మంచినీళ్లు, గునపం, తట్ట, పారకి ఆటోకి చార్జీలు, సమ్మర్ అలవెన్స్ అన్ని సౌకర్యాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్లబోయిన రాంబాబు, పట్టపగలు లతాకుమారి, ప్రభావతి, వెంకటేశ్వర పసలపూడి, బాలస్వామి, సీసాల దుర్గ, అంపోలు మహాలక్ష్మి, లంకా సత్యనారాయణ, చల్లా వెంకటలక్ష్మి, జుత్తిక వెంకటలక్ష్మి, తాళ్లపూడి సూర్యనారాయణమ్మ, ఆకుల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మహిళను బెదిరించిన నేరంపై వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. అశ్వారావుపేటకు చెందిన ఆలా నగ్మకు జంగారెడ్డిగూడెంలో 605 చ.గ. ఇంటి స్థలం ఉందన్నారు. ఈ స్థలానికి పడమరవైపు 50 అడుగుల రోడ్డు ఉందని, గత ఆరు నెలలుగా నగ్మను జంగారెడ్డిగూడెం సుబ్బంపేటకు చెందిన పోలిన శ్రీనివాసరావు బెదిరిస్తున్నాడని తెలిపారు. నగ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

యువకుడిపై దాడి

జంగారెడ్డిగూడెం: స్థానిక ఓ ఫైనాన్స్ కంపెనీలో రికవరి ఏజెంట్ ఎం.పవన్‌కుమార్ అనే యువకుడిని 8 మంది వ్యక్తులు దాడి చేసి కొట్టి గాయపర్చారు. పవన్‌కుమార్ స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పవన్‌కుమార్ పనిచేసే ఫైనాన్స్ కంపెనీ నుంచి ఎ.శివ అనే యువకుడు 6 నెలల క్రితం మోటార్‌సైకిల్ ఫైనాన్స్‌పై తీసుకున్నాడు. నాలుగు నెలల వాయిదాలు పెండింగ్‌లో ఉన్నాయని, శివ కనిపించకపోవడంతో అతని ఆచూకీ కోసం పవన్‌కుమార్ ప్రయత్నించాడు. ఈ నేపథ్యంలో శివతో మరో ఏడుగురు కలిసి స్థానిక మోటార్‌సైకిల్ షోరూమ్‌లో ఉన్న పవన్‌కుమార్‌పై దాడి చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు పవన్‌కుమార్ తెలిపారు.

నేటి నుంచి వేసవి శిక్షణ

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం చక్రదేవరపల్లి ఎర్రకాలువ వాటర్ స్పోర్ట్స్ నందు ఈనెల 6 నుంచి 31 వరకు వేసవి శిక్షణ నిర్వహిస్తున్నట్టు కోచ్‌లు మూర్తి, రాజేష్‌లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రాధికారక సంస్థ ఆధ్వర్యంలో కయా కింగ్, కానోయిన్, రోయింగ్ వంటి జల క్రీడలలో శిక్షణ ఇస్తామన్నారు. 12 సంవత్సరాల పైబడిన వారు శిక్షణలో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతిరోజు ఉదయం ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన డీఎల్‌డీఓ



కుకునూరులో డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ రాజు

కుకునూరు: మండలంలోని మారేడు బాకా కుక్కునూరు దాచారం గుమ్ముగూడెం పంచాయతీల్లోని డంపింగ్ యార్డ్‌లను డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎం.రాజు శుక్రవారం పరిశీలించారు. మండలంలోని వీఆర్‌ఓలు తాము ఇన్‌చార్జీలుగా ఉన్న సచివాలయాల పరిధిలో కూడా వారంలో రెండు రోజులు మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు నిర్వహించే స్పందన కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. వారు స్పందన కార్యక్రమానికి హాజరు కాకపోవడంతో ప్రజలు రెవెన్యూ సమస్యలపై ఇబ్బందులు పడుతున్నట్టు ఆయన దృష్టికి వచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, కుకునూరు సెక్రటరీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంతి భవన నిర్మాణానికి శంకుస్థాపన



దొరమామిడిలో విశ్రాంతి భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: మండలంలోని దొరమామిడిలో ప్రయాణికులు విశ్రాంతి భవన నిర్మాణానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సీఎం నిధులు రూ.5 లక్షలతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నట్టు చెప్పారు. సకాలంలో నిర్మాణ పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం రాముడు, ఎంపీపీ కారం శాంతి, నాయకులు కాళింగి వెంకటేశ్వరరావు, చింతలపూడి వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దాసియ్యపాలెంలో 'మా నమ్మకం నువ్వే జగన్'



దాసియ్యపాలెంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని సీతప్పగూడెం సచివాలయం పరిధిలోని దాసియ్యపాలెంలో శుక్రవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అంటించారు. ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ తెల్లం సింహాచలం, ఎంపీటీసీ మొడియం వెంకాయమ్మ, పార్టీ సీనియర్ నాయకులు మడకం జంపాలరావు, గ్రామ సచివాలయ కన్వీనర్ ధర్ముల బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి హాజరుకండి

జంగారెడ్డిగూడెం: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఈనెల 7న రాజమండ్రిలో నిర్వహించనున్నట్టు ప్రగళ్లపాటి కాశీ విశ్వనాథం తెలిపారు. రాజమండ్రి సెంట్రల్ జైలు రోడ్డులో ఉన్న మంజీరా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటరులో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్యులు పాల్గొని ఐక్యతను చాటాలని కోరారు. ఆర్యవైశ్యుల ఐక్యత రాగాన్ని, సంఘటితాన్ని సమాజానికి చాటి చెప్పాల్సిన ఆవశ్యకత ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో ఉందని తెలిపారు. కార్యక్రమం విజయవంతం చేయడానికి చింతలపూడి, పోలవరం, నియోజకవర్గ ఇన్‌చార్జిగా జిల్లా ఆర్యవైశ్య సంఘ నాయకులు తనను నియమించినారని తెలిపారు.